RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 238 | సంపుటి 4 | మంగళవారం | 19-05-2026 | పేజీలు 4 | వెల 3/-

## పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతల అష్టకష్టాలు



# కాంటా కాకపాయె..
# లారీ రాకపాయె!

- కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు
- తూకాలు నిలిచిపోవడంతో కర్షకుల ఆగ్రహం
- అకాల వర్షాల భయంతో ధాన్యం కాపాడుకునే యత్నం
- మార్కెట్లకు తాళాలు వేసి నిరసనలకు దిగిన రైతులు
- తరుగు, తేమ పేరుతో దోపిడీ చేస్తున్నారంటూ ఆరోపణలు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాస్తారోకోలు
- గుండెపోటుతో కొనుగోలు కేంద్రంలోనే రైతు మృతి
- ధాన్యం కొనలేదని ఒంటిపై డీజిల్ పోసుకున్న రైతన్న
- టోకెన్ల గందరగోళంతో రైతుల్లో తీవ్ర ఆవేదన
- ట్రాక్టర్లతో రోడ్లపై బారులు తీరిన అన్నదాతలు

**తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల జాప్యం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తరలించినా రోజుల తరబడి కాంటాలు వేయకపోవడం, లారీలు అందుబాటులో లేకపోవడం, హమాలీల కొరత, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షా ల భయంతో ధాన్యం రాశుల వద్దే రేయింబవళ్లు కాపలా కాస్తున్న అన్నదాతలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ యార్డుల వద్ద రైతుల నిరసనలు, రాస్తారోకోలు కొనసాగుతుండగా, కొనుగోలు కేంద్రాల్లోనే రైతు గుండెపోటుతో మృతి చెందడం, జనగామ జిల్లాలో ధాన్యం తూకం వేయడం లేదని ఓ రైతు ఒంటిపై డీజిల్ పోసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని కర్షకులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.**

ప్రభాత గమనం, హైదరాబాద్ : తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల జాప్యం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆరుగాలం శ్రమించి, అప్పులు చేసి, విత్తనాలు కొనుగోలు చేసి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నా రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. కాంటాలు వేయడంలో జాప్యం, లారీలు అందుబాటులో లేకపోవడం, హమాలీల కొరత, గన్నీ బ్యాగుల సమస్య, అధికారుల నిర్లక్ష్యం, దళారుల జోక్యం వంటి కారణాలతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు పేరుకుపోతుండగా రైతులు రేయింబవళ్లు అక్కడే గడుపుతున్నారు. అకాల వర్షాలు కురిస్తే పంట పూర్తిగా తడిసి నష్టపోతామనే భయంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. పగలు మండుటెండలు, రాత్రి దోమల మధ్య కొనుగోలు కేంద్రాల వద్దే కాపలా కాస్తూ రైతులు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ..మిగతా 2వ పేజీలో..

# ప్లేఆఫ్స్‌కు సన్‌రైజర్స్

## సీఎస్ కేపై ఘన విజయం సాధించిన ఆరెంజ్ ఆర్మీ

- ఉత్కంఠ పోరులో చెన్నైపై 5 వికెట్ల తేడాతో గెలుపు
- ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్.. క్లాసెన్ కీలక భాగస్వామ్యం
- టాప్-2 ఆశలు సజీవం చేసుకున్న హైదరాబాద్ జట్టు




## అప్పు ఇచ్చిన వారినే అంతమొందించే కుట్ర

- మొయినాబాద్ జంట హత్యల కేసులో సంచలన విషయాలు
- 8 మంది రుణదాతలను చంపేందుకు పక్కా ప్లాన్
- ఇద్దరిని హత్య చేసి.. మరో ఆరుగురిని ఫామ్ హౌస్ కు పిలుపు
- అక్కడికి వెళ్లకపోవడంతో తప్పిన ప్రాణాలు
- అప్పులు తీర్చకుండా హత్యలకు తెరలేపిన దంపతులు
- రుణదాతల్లో భయాందోళనలు.. పోలీసులను ఆశ్రయించిన మహిళలు




# వేడుకకు వెళ్తుండగా
# మృత్యుఘోష

**శుభకార్యాలకు వెళ్తున్న కుటుంబాల్లో రోడ్డు ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో నిశ్చితార్థ వేడుకకు వెళ్తున్న బంధువులతో కూడిన ట్రక్కును కంటైనర్ ఢీకొనడంతో 12 మంది దుర్మరణం చెందగా, 20 మందికిపైగా గాయపడ్డారు. మరోవైపు బీహార్ లోని ఖగారియా జిల్లాలో ట్రక్కు-ఆటో ఢీకొన్న ప్రమాదంలో రెండు నెలల చిన్నారి సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా జరిగిన ఈ రెండు ఘటనలు దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపాయి. క్షతగాత్రుల కేకలతో ఘటనా స్థలాలు హృదయ విదారకంగా మారగా, సహాయక బృందాలు శిథిలాల మధ్య చిక్కుకున్న వారిని బయటకు తీసి ఆసుపత్రులకు తరలించాయి.**

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 19 మంది దుర్మరణం
- ఎంగేజ్ మెంట్ కు వెళ్తుండగా ట్రక్కును ఢీకొట్టిన కంటైనర్
- మహారాష్ట్రలో ఘటన..
- 12 మంది దుర్మరణం.. 20 మందికిపైగా గాయాలు
- శుభకార్యానికి వెళ్లిన కుటుంబాల్లో విషాదం
- బోల్తా పడ్డ వాహనాలు.. కేకలతో మార్మోగిన హైవే
- అతివేగమే ప్రమాదానికి కారణమని అనుమానం
- బిహార్ లో మరో ప్రమాదం.. ఏడుగురు మృతి
- ట్రక్కు-ఆటో ఢీ.. పలువురి పరిస్థితి విషమం
- వరుస రోడ్డు ప్రమాదాలతో దేశవ్యాప్తంగా ఆందోళన
- క్షతగాత్రులతో ఆసుపత్రుల్లో విషాద వాతావరణం





# కాంటా కాకపాయే.. లారీ రాకపాయే!

**మొదటిపేజీ తరువాయి..**

పండించిన పంట అమ్ముడవక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని రైతులు వాపోతున్నారు.

### మార్కెట్ యార్డులకు తాళాలు వేసిన రైతులు

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరులో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించడం లేదని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డుకు తాళాలు వేసి నిరసన చేపట్టారు. రోజులు గడుస్తున్నా వడ్లు కొనడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత లేకపోవడంతో పాటు కొంతమందికి ప్రాధాన్యత ఇస్తూ చిన్న రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. మెదక్ జిల్లా రామాయంపేటలో నెల రోజులుగా తూకాలు వేయడం లేదని రైతులు రాస్తారోకో నిర్వహించారు. కాంటాలు వేయక, లారీలు అందుబాటులో లేక సరకు కల్లాల్లోనే ఉండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే ధాన్యం తడిసి నష్టపోతామని, ఆ నష్టాన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. రైతుల నిరసనతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

### తరుగు, తేమ పేరుతో దోపిడీ

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చెన్నాపూర్, చిన్న గొట్టిముక్కల కొనుగోలు కేంద్రాలను సందర్శించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తరుగు, తేమ పేరుతో రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. రైతుల పంటను తక్కువగా అంచనా వేస్తూ భారీగా కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరుగుతున్నాయని, కొంతమంది దళారులు అధికారులతో కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కర్షకులు ఆరోపిస్తున్నారు. ధాన్యం త్వరగా కొనుగోలు చేయకుండా కావాలనే జాప్యం చేస్తున్నారని, దీంతో రైతులు నష్టపోతున్నారని వాపోతున్నారు.

### కొనుగోలు కేంద్రంలోనే రైతు మృతి

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేటకు చెందిన రైతు వెంకటేశ్వర్లు ధాన్యం అమ్ముకునేందుకు మూడు రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి వచ్చారు. వడ్లను ఎండబెట్టడం, నేరుపడం చేస్తూ తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. రెండు రోజులుగా ఛాతినొప్పితో బాధపడుతున్నప్పటికీ ధాన్యం తూకం పూర్తయిన తర్వాత ఆసుపత్రికి వెళ్దామని భార్యతో చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం కొనుగోలు కేంద్రానికి చేరుకున్న ఆయన వడ్లను నేరుపుతుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. తోటి రైతులు వెంటనే స్థానిక ఆర్ఎంపీ వైద్యుడికి సమాచారం ఇవ్వగా సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. రైతు మృతి స్థానికంగా విషాదాన్ని నింపింది. కొనుగోళ్లలో జాప్యమే రైతు ప్రాణం తీసిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

### రోడ్లపై ట్రాక్టర్ల బారులు

మొక్కజొన్న రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కొనుగోళ్లలో తీవ్ర జాప్యంతో మార్క్ ఫెడ్ కేంద్రాల వద్ద వందల సంఖ్యలో ట్రాక్టర్లు నిలిచిపోయాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం వద్ద మొక్కజొన్న లోడుతో ట్రాక్టర్లు బారులు తీరాయి. రైతులు రాత్రింబవళ్లు అక్కడే ఉంటూ తమ సరకు ఎప్పుడు తూకం వేస్తారో అని ఎదురుచూస్తున్నారు. కొంతమంది రైతులు ట్రాక్టర్లపైనే నిద్రిస్తుండగా, మరికొందరు చెట్ల కింద గడుపుతున్నారు. భోజనం, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. రోజులు గడుస్తున్నా పంట అమ్ముడవక పెట్టుబడులు తిరిగి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంట కొనకపోతే తాము ఎలా బతకాలంటూ ప్రశ్నిస్తున్నారు.

### ఒంటిపై డీజిల్ పోసుకున్న రైతన్న

జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం ఏనెబావిలో రైతు పొన్నం తిరుమలేశ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఏప్రిల్ 8న కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసినా ఇప్పటికీ తూకం వేయకపోవడంతో ఆవేదన చెందాడు. తనకు రావాల్సిన టోకెన్ నంబరు 15ను మార్చి 76గా నమోదు చేశారని ఆరోపించాడు. ఇతర గ్రామాల రైతుల ధాన్యం ముందుగా తూకం వేస్తుండగా తనను కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయాడు. పిల్లల పాఠశాల ఫీజులు చెల్లించాల్సి ఉందని, వ్యవసాయ పెట్టుబడుల కోసం అప్పులు తీర్చాల్సి ఉందని, కానీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం కూడా హమాలీలు రాకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన తిరుమలేశ్ తన ధాన్యం రాశిపై, ఒంటిపై డీజిల్ పోసుకున్నాడు. గమనించిన స్థానికులు, తోటి రైతులు వెంటనే అడ్డుకుని సముదాయించారు. అనంతరం అధికారులు స్పందించి ధాన్యానికి కాంటా వేశారు.

### రైతుల్లో పెరుగుతున్న అసహనం

రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఇలాంటి సమస్యలే ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శిస్తున్నారు. కొన్నిచోట్ల లారీలు లేక ధాన్యం నిల్వ ఉండిపోతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో గన్నీ బ్యాగుల కొరత రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది.

### వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్

రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, లారీలు, హమాలీలు, గన్నీ బ్యాగులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



# ప్లేఆఫ్స్‌కు సన్‌రైజర్స్


- సీఎస్‌కేపై ఘన విజయం సాధించిన ఆరెంజ్ ఆర్మీ
- ఉత్కంఠ పోరులో చెన్నైపై 5 వికెట్ల తేడాతో గెలుపు
- ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్.. క్లాసెన్ కీలక భాగస్వామ్యం
- టాప్-2 ఆశలు సజీవం చేసుకున్న హైదరాబాద్ జట్టు

**ప్రభాత గమనం, చెన్నై :**

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టింది. చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో సమష్టి ప్రదర్శనతో అదరగొట్టిన ఆరెంజ్ ఆర్మీ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సీఎస్‌కే నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని సన్‌రైజర్స్ 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్‌కు ఇషాన్ కిషన్ అద్భుత ఇన్నింగ్స్‌తో అండగా నిలిచాడు. 70 పరుగులతో జట్టును విజయతీరాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. హెన్రిచ్ క్లాసెన్ 47 పరుగులతో విలువైన ఇన్నింగ్స్ ఆడగా, మధ్య ఓవర్లలో ఇద్దరూ కలిసి మ్యాచ్‌ను హైదరాబాద్ వైపు తిప్పారు. చివర్లో బ్యాటర్లు చాకచక్యంగా ఆడి జట్టుకు విజయాన్ని అందించారు. చెన్నై బౌలర్లలో ముకేశ్ చౌదరి రెండు వికెట్లు పడగొట్టగా, అన్షుల్ కంబోజ్, నూర్ అహ్మద్, అఖీల్ హొసెన్ తలో వికెట్ తీశారు. అయితే హైదరాబాద్ బ్యాటర్ల దూకుడును పూర్తిగా అడ్డుకోలేకపోయారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 180 పరుగులు చేసింది. కార్తిక్ శర్మ 39 పరుగులతో రాణించగా, డివాల్డ్ బ్రెవిస్ 44 పరుగులతో ఆకట్టుకున్నాడు. శాంసన్ 27, అభిషేక్ శర్మ 26 పరుగులతో ఫర్వాలేదనిపించారు. సన్‌రైజర్స్ బౌలర్లలో కెప్టెన్ పాట్ కమిన్స్ మూడు వికెట్లతో చెలరేగాడు. సాకిబ్ హుస్సేన్ రెండు వికెట్లు తీసి సీఎస్‌కేను కట్టడి చేశాడు. ప్రఫుల్ హింగే, ఏషన్ మలింగ తలో వికెట్ దక్కించుకున్నారు. ఈ విజయంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ 13 మ్యాచ్‌ల్లో 16 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఇంకా ఒక మ్యాచ్ మిగిలి ఉండగా మే 22న రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఆ మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తే టాప్-2లో నిలిచే అవకాశం ఉంది. మరోవైపు సన్‌రైజర్స్ విజయం రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ జట్లకు కూడా అనుకూలంగా మారింది. ప్లేఆఫ్స్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది.

# అప్పు ఇచ్చిన వారినే అంతమొందించే కుట్ర

* మొయినాబాద్ జంట హత్యల కేసులో సంచలన విషయాలు
* 8 మంది రుణదాతలను చంపేందుకు పక్కా ప్లాన్
* ఇద్దరిని హత్య చేసి.. మరో ఆరుగురిని ఫామ్ హౌస్ కు పిలుపు
* అక్కడికి వెళ్లకపోవడంతో తప్పిన ప్రాణాలు
* అప్పులు తీర్చకుండా హత్యలకు తెరలేపిన దంపతులు
* గొంతు నులిమి చంపి ఫామ్ హౌస్ లో పూడ్చిపెట్టిన నిందితులు
* విచారణలో విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి
* కరీమాబేగం ఆత్మహత్యాయత్నంతో కలకలం
* రుణదాతల్లో భయాందోళనలు.. పోలీసులను ఆశ్రయించిన మహిళలు
* తవ్వకాల్లో బయటపడిన మృతదేహాలు



**ప్రభాత గమనం, మొయినాబాద్ :**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. అప్పులు తీసుకుని తిరిగి చెల్లించలేకపోయిన కరీమాబేగం, ఆమె భర్త రెహమాన్, బంధువు నయీం కలిసి తమకు డబ్బులు ఇచ్చిన వారినే హత్య చేయాలని పక్కా ప్రణాళిక రచించినట్లు పోలీసుల విచారణలో తేలింది. మొత్తం ఎనిమిది మంది రుణదాతలను చంపాలని నిందితులు ప్లాన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే ఇద్దరు వృద్ధ మహిళలను హత్య చేసిన నిందితులు, మరో ఆరుగురిని కూడా అదే విధంగా ఫామ్‌హౌస్‌కు పిలిచినట్లు వెల్లడైంది. అయితే వారు అక్కడికి వెళ్లకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. జంట హత్యల కేసు బయటపడిన తర్వాత తమకూ ప్రాణహాని ఉందని భావించిన మరో ఆరుగురు మహిళలు పోలీసులను ఆశ్రయించడం కలకలం రేపింది. నిందితులు అప్పు తీసుకుని తిరిగి ఇవ్వకుండా రుణదాతలను ఒక్కొక్కరిని హత్య చేయాలని భావించిన తీరు స్థానికంగా భయాందోళనలు కలిగిస్తోంది.

### అప్పు తిరిగి అడిగిన మహిళలే టార్గెట్

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉండే కరీమాబేగం, ఆమె భర్త రెహమాన్, బంధువు నయీం పలువురి నుంచి భారీ మొత్తంలో అప్పులు తీసుకున్నారు. అయితే చాలా కాలం గడిచినా డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో రుణదాతలు ఒత్తిడి తెచ్చారు. దీంతో అప్పులు తీర్చకుండా వారినే అంతమొందించాలని నిందితులు పథకం రచించారు. ఈ క్రమంలో మహబూబాబీ అనే మహిళను ముందుగా డబ్బులు ఇస్తామని నమ్మించి మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లారు. అక్కడ గొంతు నులిమి హత్య చేసి ఫామ్‌హౌస్ పరిసరాల్లో గొయ్యి తీసి శవాన్ని పూడ్చిపెట్టారు. అనంతరం మరో మహిళ ఆబేదా బేగంను కూడా అదే విధంగా అక్కడికి రప్పించి హత్య చేశారు. ఇద్దరి మృతదేహాలను వేర్వేరు ప్రదేశాల్లో పాతిపెట్టినట్లు పోలీసులు తెలిపారు.

### మరో ఆరుగురిని కూడా పిలిచిన నిందితులు

ఇద్దరు మహిళల హత్య అనంతరం అప్పు ఇచ్చిన మరో ఆరుగురు మహిళలను కూడా ఫామ్‌హౌస్‌కు పిలిచినట్లు విచారణలో తేలింది. అయితే అనుమానంతో వారు అక్కడికి వెళ్లకపోవడంతో ప్రాణాలు దక్కాయి. జంట హత్యల విషయం వెలుగులోకి రావడంతో తమకూ ప్రమాదం ఉందని గ్రహించిన ఆరుగురు మహిళలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

### కరీమాబేగం ఆత్మహత్యాయత్నం

ఈ కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబేగాన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆదివారం కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. ఈ సందర్భంగా బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో పోలీసులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షిస్తున్నారు.

### తవ్వకాల్లో బయటపడిన మృతదేహాలు

నిందితుల సమాచారంతో తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యాలాల ఎస్సై విఠల్‌రెడ్డి, బషీరాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ పోలీసు సిబ్బంది ఫామ్‌హౌస్ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టారు. ఈ సందర్భంగా మహబూబాబీ అస్థిపంజరం బయటపడగా, అనంతరం ఆబేదాబేగం మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. ఈ కేసులో ఇంకా మరిన్ని కోణాలు ఉన్నాయా అనే దానిపై పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు. అప్పుల వ్యవహారం, నిందితుల ఆర్థిక పరిస్థితి, మరెవరైనా ఈ కుట్రలో భాగమయ్యారా అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.



# టిబిపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్
- ఎస్ టీఎల్ ఎస్ లు, టిబి సూపర్ వైజర్లతో జిల్లా స్థాయి సమీక్ష

**మహబూబాబాద్, మే18(ప్రభాత గమనం):**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎస్‌టీఎల్‌ఎస్‌లు టిబి సూపర్వైజర్లతో జిల్లా స్థాయి టిబి సమీక్ష సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ..జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలన లక్ష్య సాధనకు క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. టిబి అనుమానితులను త్వరితగతిన గుర్తించి పరీక్షలు నిర్వహించడం, నిర్ధారిత రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స అందించడం, చికిత్స మధ్యలో మానివేయకుండా పర్యవేక్షణ చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అదేవిధంగా నిక్షయ్ పోర్టల్‌లో వివరాలను సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. టిబి నియంత్రణ కార్యక్రమాల అమలు, లక్ష్యాలు పనితీరుపై సమీక్ష నిర్వహించారు. టిబి వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ అర్జున్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, అశోక్ టిబి సిబ్బంది, ఎస్‌టీఎల్‌ఎస్‌లు, టిబి సూపర్వైజర్లు, ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వేడుకకు వెళ్తుండగా మృత్యుఘోష

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 19 మంది దుర్మరణం
- ఎంగేజ్ మెంట్ కు వెళ్తుండగా ట్రక్కును ఢీకొట్టిన కంటైనర్
- మహారాష్ట్రలో ఘటన..
- 12 మంది దుర్మరణం.. 20 మందికిపైగా గాయాలు
- శుభకార్యానికి వెళ్లిన కుటుంబాల్లో విషాదం
- బోల్తా పడ్డ వాహనాలు.. కేకలతో మార్మోగిన హైవే
- అతివేగమే ప్రమాదానికి కారణమని అనుమానం
- బిహార్ లో మరో ప్రమాదం.. చిన్నారి సహా ఏడుగురు మృతి
- ట్రక్కు-ఆటో ఢీ.. పలువురి పరిస్థితి విషమం
- వరుస రోడ్డు ప్రమాదాలతో దేశవ్యాప్తంగా ఆందోళన
- క్షతగాత్రులతో ఆసుపత్రుల్లో విషాద వాతావరణం



**ప్రభాత గమనం, పాల్ఘర్/ఖగారియా:**

శుభకార్యానికి వెళ్తున్న ఆ కుటుంబాల్లో రోడ్డు ప్రమాదాలు తీరని విషాదాన్ని నింపాయి. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదంలో 12 మంది మృతి చెందగా, బీహార్‌లోని ఖగారియాలో జరిగిన మరో ఘటనలో రెండు నెలల పసికందు సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.

### పాల్ఘర్‌లో ఎంగేజ్‌మెంట్‌కు వెళ్తుండగా విషాదం

మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా ముంబయి-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బాపుగావ్ ఖడ్కిపాడ గ్రామానికి చెందిన బలరామ్ జైరామ్ దండేకర్ నిశ్చితార్థ వేడుక కోసం సుమారు 100 మంది బంధువులు ఒకే ట్రక్కులో బయలుదేరారు. వాహనం దహను తాలూకాలోని ధనివారి గ్రామం వద్దకు రాగానే, పశువులతో వస్తున్న ఒక కంటైనర్ అతివేగంతో ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి రెండు వాహనాలు రోడ్డుపైనే బోల్తా పడ్డాయి. ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. ట్రక్కులో సామర్థ్యానికి మించి ప్రయాణికులు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

### బీహార్‌లో ఆటోను ఢీకొన్న ట్రక్కు: ఏడుగురు బలి

మరోవైపు బీహార్‌లోని ఖగారియా జిల్లా జాతీయ రహదారి-31పై జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. వేగంగా వచ్చిన ట్రక్కు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో-రిక్షాను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జు కాగా, అందులో ప్రయాణిస్తున్న రెండు నెలల చిన్నారి, ఒక మహిళ సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్కు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

### ఘటనా స్థలాల్లో సహాయక చర్యలు

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు రంగంలోకి దిగి శిథిలాల మధ్య చిక్కుకున్న బాధితులను బయటకు తీశారు. రెండు ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఒకే రోజు జరిగిన ఈ రెండు భారీ ప్రమాదాలు దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతిని కలిగించాయి.

# రైతన్నలకు పోలీసు భరోసా

- అన్నదాతల సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఎస్పీ పర్యటన
- ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి..
- రైతులకు అండగా ములుగు జిల్లా పోలీసులు
- ధాన్యం రవాణా, తూకం అక్రమాలపై చర్యలు తీసుకుంటాం
- రైతులకు న్యాయం జరిగేలా చర్యలు
- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ములుగు జిల్లా జంగాలపల్లి వద్ద కల్లాన్ని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ, వడ్లను రైస్ మిల్లులకు తరలించేందుకు సరిపడా రవాణా సదుపాయాలు లేక ఆలస్యం జరుగుతోందని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎస్పీకి వివరించారు. అదేవిధంగా రైస్ మిల్లుల వద్ద కాంటా తూకంలో అధికంగా వడ్లు కట్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. రైతుల సమస్యలను విన్న ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రైతులకు తెలిపారు, రైతుల సమస్యల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ రైతులకు అన్ని సమయాలలో అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం అబ్బాపూర్‌లోని శ్రీ మాతా ఆగ్రో టెక్ పారా బాయిల్డ్ రైస్ మిల్లును పరిశీలించారు. మిల్లులో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజుకు ఎంత మేర వడ్లు స్వీకరిస్తున్నారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాంటా తూకం యంత్రాన్ని, వడ్ల నాణ్యత తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. రైతుల నుండి సాధ్యమైనంత ఎక్కువ వడ్లు పారదర్శకంగా కొనుగోలు చేయాలని, తూకం విషయంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి ఎస్పీ ఆదేశించారు. తూకంలో తేడాలు గమనిస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోగల వడ్ల కల్లాలను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రోజువారి ఎగుమతి పై నివేదిక ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు.



## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడి

- 10 మంది అరెస్ట్ రూ.1.91 లక్షల నగదు స్వాధీనం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,91,150 నగదు, 10 మొబైల్ ఫోన్లు, పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వహణపై టాస్క్‌ఫోర్స్ బృందానికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హనుమకొండలోని ఇందిరానగర్ ప్రాంతంలో కొక్కిరాల రవీందర్ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు గుర్తించి పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో అక్కడ పేకాటలో పాల్గొంటున్న 10 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, మొబైల్ ఫోన్లు, పేకాట సామగ్రితో పాటు నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం సుబేదారి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో వ్యాపారులు, వ్యవసాయదారులు వివిధ ప్రాంతాలకు చెందినవారు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. హనుమకొండ, జనగామ, హుజూరాబాద్, హసన్‌పర్తి, గోపాల్పూర్ తదితర ప్రాంతాలకు చెందిన వారు పేకాటలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌ను ఏసీపీ ఎ. మధుసూధన్ పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ జి. బాబులాల్, ఆర్ఎస్ఐ ఓ. భాను ప్రకాష్, ఎస్ఐ బి. ఉప్పలయ్య, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు. పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేకాట, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్ లేదా టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.



## కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను మానుకోవాలి

- ధరల పెంపును నిరసిస్తూ మహమూద్‌పట్నంలో మీడియా సమావేశం
- బీజేపీ ప్రభుత్వ తీరుపై అంబటి మహేందర్ రెడ్డి ఫైర్

**కేసముద్రం మే 18 (ప్రభాత గమనం) :**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, విచ్చలవిడి ధరల పెంపుపై డిసిసి అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి మండిపడ్డారు. కేసముద్రం మండలం మహమూద్‌పట్నం గ్రామంలో సోమవారం స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిసిసి అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి హాజరయ్యి మాట్లాడారు.."కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాటాలను ఉధృతం చేస్తుందని హెచ్చరించారు."బిజెపి మోసపూరిత విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నాయకులకు పిలుపునిచ్చారు. "మోడీ హటావో.. దేశ్ కీ బచావో" అనే నినాదంతో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గ్రామీణ స్థాయిలోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు.ఈ సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచ్ లు, మహమూద్‌పట్నం ఉపసర్పంచ్ అమృత శ్రీనివాస్, తౌర్యా తండా ఉపసర్పంచ్ ధరావత్ మహేందర్, పార్టీ అధ్యక్షులు మిట్టగడుపుల యాకూబ్, జాటోత్ రమేష్, మాజీ ఎంపిటిసి ముంజల శ్రీనివాస్,వెంకటాచారి, మందుల ముత్తయ్య, భాష మార్చు, కట్ల లచ్చమ్మ, బానోతు వీరు, తొగరి తిరుపతి, ఇస్లావత్ సంతోష్, సురేష్, కాంభోజి యాకయ్య, జాటోత్ రాము తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం పీఎస్ లో ఎస్పీ తనిఖీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లా బయ్యారం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఈరోజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, కార్యాలయ గదులు, సిబ్బంది పని విధానాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహణ, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బయ్యారం ఎస్ఐ ప్రశాంత్‌ను అడిగి పోలీస్ స్టేషన్‌లో ఉన్న సిబ్బంది బలం, వారి విధులు, పని విభజన తదితర అంశాలపై సమాచారం తీసుకున్నారు. సిబ్బంది పనితీరు మరింత మెరుగుపర్చాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, స్టేషన్‌కు వచ్చే పిటిషనర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల వారీగా పర్యటనలు నిర్వహిస్తూ గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. అలాగే విపిఓలు (విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ ) యాక్టివ్‌గా పనిచేయాలని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని, వేసవి కాలంలో చోరీలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి నిర్మూలన చర్యలను మరింత వేగవంతం చేయాలని, అక్రమ రవాణా మరియు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.




## ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**ప్రభాత గమనం,వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రతి సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నందు నిర్వహించే ప్రజా ఫిర్యాదులను కార్యక్రమంలో కమిషనరేట్ నలుమూలల నుండి ఫిర్యాదుదారులు తమ సమస్యలను పోలీస్ కమిషనర్ కి స్వయంగా తెలియజేశారు. సమస్యలను విన్న పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి శాశ్వత పరిష్కారాలు చూపాలని, బాధితుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడు పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయంలో దాదాపు 10 ఫిర్యాదులను సేకరించడం జరిగింది. వచ్చిన ఫిర్యాదులలో కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, కేసుల పురోగతి, భూ సమస్యలు, తదితర విషయాలు ఉన్నట్లు సీపీ తెలిపారు. కమిషనరేట్



వ్యాప్తంగా అసంఘిక కార్యకలాపాలపై ఎలాంటి సమాచారం ఉన్న 8712685257 నంబర్ కు వాట్సప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీస్ కమిషనర్ తెలిపారు.



## కేశవరావు కమిటీ ఏర్పాటుపై ఉద్యమకారుల హర్షం

- ఎన్నికల హామీలను త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్
- కేసముద్రంలో అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారుల సమావేశం

**కేసముద్రం, మే 18 (ప్రభాత గమనం):**

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు సీనియర్ నాయకులు కె.కేశవరావు అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం పట్ల కేసముద్రం మండల తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కేసముద్రం పట్టణ కేంద్రంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద 'తెలంగాణ ఉద్యమకారుల ఫోరం' ఆధ్వర్యంలో ఒక ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు అమరవీరులకు నివాళులర్పించి, తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు చాగంటి కిషన్ మాట్లాడుతూ.. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ఈ కమిటీకి సంబంధించిన విధివిధానాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2023 ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అక్షరాలా అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అర్హులైన ప్రతి ఉద్యమకారుడిని గుర్తించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలిపారు. ఉద్యమకారులకు 250 గజాల నివాస స్థలంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలన్నారు. ఉద్యమ సమయంలో అమరులైన, మరణించిన ఉద్యమకారుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అర్హత కలిగిన ఉద్యమకారుల పిల్లలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిసిసి సభ్యులు గుగులోత్ దస్రూనాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కేవలం కమిటీల ఏర్పాటుకే పరిమితం కాకుండా, కాలయాపన చేయకుండా ఇచ్చిన హామీలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. సుదీర్ఘ పోరాటంలో నష్టపోయిన ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ సదస్సులో కేసముద్రం మండల ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్, జెఏసి పూర్వ కన్వీనర్ మోడెం రవీందర్ గౌడ్, విద్యార్థి, యువజన జెఏసి పూర్వ కన్వీనర్ దండు శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు సీనియర్ ఉద్యమకారులు కర్పూరపు మురళి, తోట సుధాకర్, జల్లె జయరాజ్, బాలు మోహన్, సోమారపు వెంకటయ్య, చుంచు సూరయ్య, కీర్తి సమ్మయ్య, మాందాటి ఆంజనేయులు, నానబాల దూడయ్య, నాగరబోయిన చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను ప్రారంభించిన సీపీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని మోటార్ ట్రాన్స్ పోర్ట్ విభాగంలో పోలీస్ కార్ల మరమ్మత్తుల కోసం నూతనముగా నెలకొల్పబడిన భారీ హైడ్రాలిక్ యంత్రంతో పాటు, వాహన టైర్లను తొలగిం చి, అమర్చే యంత్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ స న్ ప్రీత్ సింగ్ సోమవారం ప్రారంభించారు. అనంతరం పోలీస్ కమిషనర్ అధికారులతో కలసి ఈ యంత్రాల పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సం దర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ యం.టి విభాగంలో వాహనాల మరమ్మత్తుల కోసం నూతనం గా ఏర్పాటు చేసిన యంత్రాల ద్వారా పోలీస్ వాహ నాల మరమ్మత్తు కోసం ప్రవైట్ రిపేర్ సెంటర్లపై ఆధార పడకుండా స్వయంగా మరమ్మత్తులు చేపట్టడం ద్వారా సమయంతో పాటు , కొద్ది మొత్తంలో వ్యయాన్ని అదా చేసుకోవచ్చని, పోలీస్ వాహనాలను వినియోగించె అధికారులు, సిబ్బంది వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా వాహనాలను మరమ్మత్తుల కోసం పం పించాల్సిన అవసరం ఉండదని సీపీ తెలిపారు. ఈ కా ర్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, దార కవిత, అద నపు డీసీపీలు సురేష్ కుమార్, రవి, ప్రభాకర్ రావు, శ్రీనివాస్,ఏసీపీలు నాగయ్య, అంతయ్య, సురేంద్ర, జితేందర్ రెడ్డి,సత్యనారాయణ, జాన్ నర్సింహులు ఆర్.ఐలు శ్రీధర్, స్పర్జన్ రాజ్, సతీష్, చంద్రశేఖర్, శ్రీనివాస్, యం.టి విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వసతులేవి..?

- ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న కూలీలు

**గార్ల,మే 18 (ప్రభాత గమనం) :**

గ్రామాల్లో కూలీల వలసలను నివారించి వారికి ఉపాధి పనులు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం వీబీజీ రాంజీ (జాతీయ ఉపాధి హామీ పథకాన్ని) ప్రవేశ పెట్టింది. గ్రామాల్లో ఉపాధి లభించడంతో పేదలు రోజూ పనులకు వెళ్తున్నారు. కానీ పని ప్రదేశంలో కనీస సదుపాయాలు లేకపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు. ప్రారంభంలో కూలీలకు గడ్డపారలు, మెడికల్ కిట్లు, టెంట్లు, తాగునీరు లాంటి వసతులను కల్పించారు. రాను రాను వారికి ఎలాంటి సదుపాయాలను కల్పించడం లేదు. కనీసం తాగడానికి మంచినీరు, సేద తీరడానికి నీడ సౌకర్యం కూడా లేక పోవడంతో కూలీలు అల్లాడి పోతున్నారు. ఇది వరకు కూలీలు సొంతంగా గడ్డపార సమకూర్చుకుంటే రోజుకు రూ.10, తాగునీటి కోసం



రూ.5 అందజేసే వారు ప్రస్తుతం పని ప్రదేశంలో వసతులు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మే నెల కావడంతో ఇటీవల ఎండలు తీవ్రగా ఉండడంతో కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. ఎండ తీవ్రతకు భయపడి కూలీలు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు.

### అమలుకు నోచని ప్రభుత్వ ఆదేశాలు

వేసవిలో మార్చి నుంచి జూన్ వరకు కూలీలకు తాగునీరు, వడదెబ్బ తగలకుండా నీడకోసం టెంట్లు వేసి రక్షణ కల్పించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ గార్ల మండలంలో ఎక్కడ కూడా అమలుకు నోచుకోవడం లేదు. అలసటగా ఉంటే పొదలు, చెట్ల చాటున సేద తీర్చుకోవల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం నీటిని సరఫరా చేయడానికి ఒక మేట్‌ను నియమిస్తే కూలీలకు సౌకర్యంగా ఉంటుంది. మండల వ్యాప్తంగా ఉపాధి కూలీలకు వసతులు లేక పోవడంతో ఎండలోనే సేద తీరుతున్నారు. కూలీలు భోజనం చేయడానికి అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి ప్రభుత్వం గతంలో గుడారాలు, మెడికల్ కిట్లు పంపిణీ చేసేది. వాటిని క్షేత్ర సహాయకులు ప్రతి రోజు పని ప్రదేశానికి తీసుకువెళ్లి వసతి కల్పించేవారు. ఎనిమిదేళ్లుగా గుడారాలు, మెడికల్ కిట్లు ఇవ్వడం మరిచారు. కిట్టులో అయోడిన బాటిల్, బ్యాండేజి, దూది, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు కొన్నిరకాల మాత్రలు ఉండేవి. పనికి ఉపయోగించే పరికరాలు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం స్పందించి మెడికల్ కిట్లు గుడారాలు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం మొదటి ప్రాధాన్యత కావాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ తో కలిసి అర్జీలు స్వీకరించిన కలెక్టర్



**మహబూబాబాద్ మే18(ప్రభాత గమనం):**

ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీదారుల సమస్యలను నిష్పక్షపాతంగా, నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించడమే అధికారుల మొదటి ప్రాధాన్యత కావాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ మరియు జిల్లా స్థాయి అధికారులతో కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణికి వస్తారని, వారి అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో నమోదైన ప్రతి అర్జీని ఆయా శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. ఎలాంటి జాప్యం లేకుండా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. కేవలం నివేదికల కోసమే కాకుండా, బాధితుడికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. ఒకవేళ సమస్య తిరస్కరణకు గురైతే, దానికి గల స్పష్టమైన కారణాలను అర్జీదారునికి లిఖితపూర్వకంగా తెలియజేయాలి అని అన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మరియు సంక్షేమ శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ భూ సమస్యలు, ఇతర సామాజిక సమస్యలను పరిష్కరించాలన్నారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ధరణి సమస్యలు, ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ళు, భూ వివాదాలు మరియు స్థానిక సమస్యలపై జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజలు కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. ఈ అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేస్తూ, వీలైనంత త్వరగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ స్పష్టం చేశారు. మహబూబాబాద్ మండలం చౌక్లాతండా కు చెందిన భూక్య సుందర్ నాయక్ చోక్లాతండ గ్రామపంచాయితీ మేఘ్యాతండ లో నీటి కొరత ఉండటం వలన ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని ప్రజలు వేరే చోటు నుండి నీరు తెచ్చుకోవడం ఇబ్బందులకు గురి అవుతున్నారని చౌక్లా తండ గ్రామ పంచాయతీలో మరియు మేగ్యాతండలో రెండు బోర్లు వేయించి ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బయ్యారం మండలం మిర్యాలపెంట గ్రామపంచాయతీ లోని పి.హెచ్.సి లో ఎం.బి.బి.ఎస్ డాక్టర్ ని నియామించాలని జిల్లా కేంద్రానికి మా గ్రామం దూరంగా ఉందని గ్రామ ప్రజలు వైద్యం విషయంలో చాల ఇబ్బందులు పడుతున్నారని మా గ్రామ పి.హెచ్.సి లో ఎం.బి.బి.ఎస్ డాక్టర్ ని నియామించి వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మెన్ వర్స ప్రకాష్ బయ్యారం మండలం లోని కొత్తపేట గ్రామపంచాయతీలో కొత్తపేట మరియు గంధంపల్లి రెవెన్యు గ్రామములో గల ప్రభుత్వ భూములను ఏజెన్సీ యాక్ట్ ప్రకారం గిరిజనేతరులు ప్రభుత్వ భూములు ఏవిధంగా అనుభవిస్తున్నారో వారికి అట్టి హక్కు ఏవిధంగా సంక్రమిచినదో తెలుపాలని, కొత్తపేట మరియు గంధంపల్లి రెవెన్యు గ్రామములలో గల ప్రభుత్వ భూములను సర్వే చేపించి ఈ యొక్క భూములను ప్రభుత్వ పరిధిలోని తీసుకోవలసిందిగా కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 132 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మక్క జొన్న, ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో రైతులను డబ్బులు వసూలు చేస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత రెండు మూడు రోజుల నుండి రికార్డు స్థాయిలలో కొనుగోలు తరలింపు జరుగుతుందని మరింత అంకితభావంతో పనిచేసే రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఈరోజు నుండి ప్రారంభమైన యువజన క్రీడా దినోత్సవ పోస్టర్ను ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## పాముకాటుకు గురైన ఉపాధి కూలీని ఆదుకోవాలి

- కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలి
- తక్షణ ఆర్థిక సాయం అందించాలి : మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్



**గార్ల, మే 18 (ప్రభాత గమనం) :**

విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తు పాముకాటుకు గురైన ఉపాధి హామీ కూలీ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, లేనిపక్షంలో కూలీలతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు, గార్ల మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ముత్తితండా గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ బానోత్ సెట్ రామ్ ప్రతిరోజూ లాగే సోమవారం ఉపాధి పనులకు వెళ్లారు. అక్కడ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆయనను పాము కరిచింది. ప్రస్తుతం ఆయన గార్ల కమ్యూనిటీ ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని అత్యంత పేద కుటుంబానికి చెందిన సెట్ రామ్.. ఆ ఇంటికి ఒకే ఒక్క జీవనాధారం కావడంతో ప్రస్తుతం ఆ కుటుంబం తీవ్ర ఆందోళనలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి బాధితుడికి ప్రభుత్వ ఖర్చులతో కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైతే పెద్ద ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడాలని రమేష్ కోరారు.

**పలువురి పరామర్శ..**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్తితండా గ్రామానికి చెందిన కూలీ బానోత్ సెట్ రాంను పలువురు రాజకీయ పార్టీల నాయకులు పరామర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ తదితరులు సోమవారం ఆసుపత్రిని సందర్శించి బాధితుడిని పలకరించారు. సెట్ రాం ఆరోగ్య పరిస్థితిపై స్థానిక వైద్యులు డాక్టర్ హనుమంతు రావును అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి. నాగేశ్వరరావు ఉన్నారు.



## రౌడీషీటర్లపై పోలీసుల ప్రత్యేక చర్య

- రోడ్డుపై నడిపిస్తూ తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి బైండోవర్ చేసిన మిల్స్ కాలనీ పోలీసులు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లపై పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలువురు రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్ నుంచి ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుపై నడిపిస్తూ తీసుకెళ్లి బైండోవర్ చేశారు. రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ చర్యల్లో రౌడీషీటర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి, ఇక్బాల్ సమక్షంలో బైండోవర్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు రౌడీషీటర్లకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకు, నేరాల నియంత్రణ కోసం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇలాంటి ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.





## పెరిగిన ఇంధన ధరలను తగ్గించాలి

**తాళ్లతో ఆటోను లాగుతూ సీపీఎం వినూత్న నిరసన**

**కేసముద్రం, మే 18 (ప్రభాత గమనం) :**

కేంద్ర ప్రభుత్వం నిరంతరాయంగా పెంచుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా కేసముద్రం మండల కేంద్రంలో సీపీఎం శ్రేణులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద ఆటోకు తాళ్లు కట్టి, చేతులతో లాగుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కార్మికులు, పార్టీ నాయకులు కదంతొక్కారు.ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ (కచ్చా చమురు) ధరలు తగ్గినప్పుడు ఆ లబ్ధిని సామాన్య వినియోగదారులకు బదిలీ చేయని ప్రభుత్వం, ధరలు స్వల్పంగా పెరిగినప్పుడల్లా 'పొదుపు సూత్రాలు' చెప్తూ ప్రజలపై భారం మోపడం దుర్మార్గామన్నారు. కార్పొరేట్ ఆయిల్ కంపెనీల లాభాల కోసమే కేంద్రం ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆయన ధ్వజమెత్తారు.నెలనెలా పెరుగుతున్న ఇంధన ధరల వల్ల కేవలం రవాణా రంగమే కాకుండా, నిత్యవసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయని వెంకన్న ఆందోళన వ్యక్తం చేశారు. "రెక్కాడితే గాని డొక్కాడనట్టుగా, కేవలం జీవనోపాధి కోసం ఆటోలు నడుపుకునే పేద కార్మిక కుటుంబాలు ఈ ధరల భారంతో రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి" అని ఆయన డిమాండ్ చేశారు.ఈ వినూత్న ఆందోళన కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు బొబ్బల యాకుబ్ రెడ్డి, చాగంటి కిషన్, నీరుటి జలంధర్, జల్లే జయరాజ్, సోమరపు ఎల్లయ్య, ఎండి యాకుబ్ పాషాతో పాటు ఆటో కార్మికులు బెజ్జం నాగరాజు, ఎండి రబ్బాని, యాకన్న, పాషా పాల్గొన్నారు.

## పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సంకీర్త్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మే 21 నుండి జూన్ 01 వరకు కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చేపడుతున్న భద్రతా, బందోబస్తు మరియు ట్రాఫిక్ ఏర్పాట్లను భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఈ సందర్భంగా పుష్కర ఘాట్లు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, కంట్రోల్ రూమ్, సీసీ కెమెరా పర్యవేక్షణ, భక్తుల రాకపోకలకు సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లను అధికారులతో కలిసి సమీక్షించారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భద్రత పరంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ 24 గంటలు అప్రమత్తంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. అలాగే విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి భక్తులకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సూచించారు.



## చెక్‌పోస్ట్ ను సందర్శించిన ఎస్పీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణా నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన బయ్యారం మండలం నామాలపాడు చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ వద్ద అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు, వాహనాల తనిఖీ విధానం, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులతో మాట్లాడిన ఎస్పీ, అక్రమంగా పశువుల తరలింపును పూర్తిగా అడ్డుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా రేడియం జాకెట్లు ధరించాలని, టార్చ్ లైట్లు, బ్యారికేడ్లు మరియు కమ్యూనికేషన్ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల రవాణాకు సంబంధించిన సరైన పత్రాలు లేని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టామని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.



## అందుబాటులో లేకున్నా అండగా సమ్మన్న..

- సేవే మార్గంగా దూసుకుపోతున్న సమ్మిగౌడ్ ఫౌండేషన్
- అనతి కాలంలోనే ప్రజాదరణ పొందుతున్న సమ్మి గౌడ్
- గద్దల ప్రభాకర్ కుటుంబానికి 75 కిలోల బియ్యం వితరణ

**కేసముద్రం, మే18(ప్రభాత గమనం):**

అందుబాటులో లేకున్నా నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు చిలువేరు సమ్మయ్య గౌడ్. అన్నా అంటే నేనున్నానంటూ కాకితో కబురు పెడితే చాలు సమస్యలున్న వారింట్లో వాలిపోతున్నారు. పక్కవారికి నేనెందుకు సహాయం చేయాలి నాకేం వస్తుందని ప్రస్తుత సమాజం పయనిస్తుంటే అలాంటి ప్రయాణం మంచిది కాదని మనకు ఉన్నదాంట్లో పక్కవారికి సహాయం చేయాలని మరోసారి చిలువేరు సమ్మయ్య గౌడ్ నిరూపించారు. కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గద్దల ప్రభాకర్ ఇటీవలే వడదెబ్బతో మృతి చెందారు. వారి కుటుంబం ఇబ్బందులలో ఉన్నదని తెలుసుకున్న చిలువేరు సమ్మయ్య గౌడ్ తను అందుబాటులో లేకున్నా 75 కిలోల బియ్యం వితరణ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్నవారు అలమటించకూడదని ఎంతోమందికి తనకున్న దాంట్లో సహాయం చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ఆపదలో ఎవరున్నా సరే చేయూతనందిస్తున్నారు. దళితుల జీవితంలో వెలుగులు నింపడానికి కంకణ బద్ధులై అహర్నిశలు కష్టపడుతున్నారు. కుల మత ప్రాంతం అనే తేడా లేకుండా సమస్య ఉందంటే చేరిపోతున్నారు. రాజకీయాల కతీతంగా సేవా మార్గాన్ని ఎంచుకుంటూ తనదైన శైలిలో సమాజంలో పయనిస్తున్నారు. ఆయన సేవా మార్గం చూసి కొత్త తరం నాయకత్వానికి ఇదే మార్గదర్శకాలని ప్రజలు చెప్పుకుంటున్నారు. నాయకుడంటే సేవకుడని మరోసారి చిలువేరు సమ్మి గౌడ్ నిరూపిస్తున్నారని ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఏది ఏమైనా చిలువేరు సమ్మన్న మీ సేవలకు సలాం అన్న అంటూ ప్రజలు జేజేలు కొడుతున్నారు. అనంతరం



సమ్మి గౌడ్ పంపిన బియ్యాన్ని గ్రామ నాయకులు గద్దల ప్రభాకర్ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తండ సంపత్, మంద ప్రవీణ్, ఉప్పలయ్య,సాయిబాబా, వెంకన్న, పోలెపాక ఉప్పలయ్య, శ్రీనివాస్, విక్రమ్,సుమన్, విజేందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374